మళ్లీ కష్టాలు..మోసాలు!

రేషన్ డోర్ డెలివరీకి
కూటమి సర్కారు మంగళం

- నేటి నుంచి చౌక దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ
- రోడ్డున పడిన ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు
- కూటమి సర్కారు తీరుపై పెల్లుబికుతున్న ఆగ్రహం



కర్నూలు నగరంలో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ డోర్ డెలివరీ దృశ్యం (ఫైల్)

కర్నూలు(సెంట్రల్) : పేదలకు మళ్లీ రేషన్ కష్టాలు మొదలు కానున్నాయి. పనులు వదులుకొని ప్రతి నెలా రేషన్‌దుకాణాల వద్ద క్యూలో నిలబడాలి. డీలర్లు వేసింది తెచ్చుకోవాలి. ప్రశ్నిస్తే చీదరింపులు. ఈ కష్టాలు తొలగించేందుకు వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన రేషన్ డోర్ డెలివరీకి కూటమి సర్కారు మంగళం పాడింది. దీంతో ప్రజలకు పాతకష్టాలు పునరావృతం కావడంతో పాటు ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, హెల్పర్లు రోడ్డున పడనున్నారు.

పాత పరిస్థితులు పునరావృతం

కర్నూలు జిల్లాలో 6,34,631 రేషన్ కార్డులు ఉన్నాయి. ఆయా కార్డుల్లో 12.65 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో పేద, మధ్యతరగతి ప్రజలే అధికం. 2021 ఏప్రిల్ ఒకటో తేదీకి ముందు వరకు రేషన్ షాపుల ద్వారా ప్రజలు సరుకులు పొందేవారు. అయితే కొన్ని గ్రామాల్లో షాపులు లేకపోవడం, పట్టణాల్లో కిలోమీటర్ల దూరంలో రేషన్ చౌకధరల దుకాణాలు ఉండడంతో సరుకులను తెచ్చుకోవడానికి ఇబ్బంది పడాల్సి వచ్చేది. అంతేకాక రేషన్ షాపుల దగ్గర గంటల కొద్ది వేచి ఉండాల్సి వచ్చేది. డీలర్లు ఎప్పుడూ ఉంటే అప్పుడు సరుకులు తీసుకోవాల్సి ఉండేది. తూకాల్లో మోసం చేసిన అడిగితే అసలు బియ్యమే వేసే వారు కాదు. బియ్యం కోసం వెళితే ఒకటి, రెండు రోజులు రేషన్ షాపు దగ్గరే ఉండే పరిస్థితులు దాపురించేవి. ఈక్రమంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఇళ్లకు రేషన్ డోర్ డెలివరీ సిస్టంను తీసుకొచ్చారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటికే సరుకులను అందించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో కార్డుదారులకు దుకాణానికి వెళ్లే అవస్థలు తప్పాయి. అయితే, సరిగ్గా ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు మళ్లీ రేషన్ షాపుల ద్వారానే నిత్యావసరాలు సరఫరా చేయాలని నిర్ణయిండంతో పాత కష్టాలు మళ్లీ పునరావృతమయ్యాయని కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు.

వైఎస్ జగన్ పేరును చెరిపేయాలనే కుట్ర

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎండీయూ వాహనాలను తొలగించాలనే కుట్ర జరిగింది. ఆ బండ్లను తొలగించకపోతే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు ప్రజల మదిలో నుంచి తొలగిపోదని, బండ్లను చూస్తే ఆయనే గుర్తుకు వస్తారన్న భయంతో సివిల్ సప్లై శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ ఓర్వలేకపోయారని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు అంటున్నారు. దీంతో స్వయంగా ఆయన సివిల్ సప్లై మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే ఎండీయూ వాహనాలను తొలగించాలని పదే పదే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సీఎం చంద్రబాబునాయుడు నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో మంత్రులతో సబ్‌కమిటీ వేశారు. ఆ కమిటీ వాహనాలను తొలగించాలని నిర్ణయించడంతో జూన్ నుంచి రేషన్ సరుకుల డోర్ డెలివరీకి ప్రభుత్వం మంగళం పాడింది. దీంతో ప్రజలను వెతుక్కుంటూ వచ్చే ఎండీయూ వాహనాలు ఆగిపోయాయి. ఇప్పుడు రేషన్ షాపులను వెతుక్కుంటూ ప్రజలు కిలోమీటర్ల మేర దూరం వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది.

రోడ్డున పడ్డ ఆపరేటర్లు,హెల్పర్లు

కూటమి ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న కోపాన్ని ఎండీయూ వాహనాలపై చూపుతోంది. ఎండీయూ వాహనాలను 2027 జనవరి వరకు నడిపేలా ఆపరేటర్లతో ప్రభుత్వ ఒప్పందం ఉంది. దీనిని బాబు సర్కారు పక్కన బెట్టి అర్ధాంతరంగా వాహనాలను తొలగించడంతో కర్నూలు జిల్లాలో 409 ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, 409 మంది హెల్పర్లు రోడ్డున పడ్డారు. తమను కొనసాగించాలని పలు దఫాలు ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి రేషన్ షాపుల్లోనే సరుకులు



నేటి నుంచి రేషన్ షాపుల్లోనే బియ్యం, బ్యాళ్లు, చక్కెర ఇతర సరుకులు ప్రజలకు ఇచ్చేలా చర్యలు చేపట్టాం. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్ 1నుంచి ఎండీయూ వాహనాల ద్వారా కాకుండా రేషన్ షాపుల్లోనే సరుకులను ఇస్తారు. 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులకు మాత్రం డోర్ డెలివరీ చేస్తారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు షాపులు పనిచేస్తాయి. పోర్టబులిటీ అందుబాటులో ఉంటుంది.

– డాక్టర్ బి.నవ్య, జాయింట్ కలెక్టర్, కర్నూలు

సర్కారు పునరాలోచన చేయాలి



నాలుగేళ్ల నుంచి ఎండీయూ వాహనాలను నడుపుకుంటూ జీవనం చేస్తున్నాం. వాటిని అర్ధాంతరంగా తొలగిస్తే మా బతుకులు, మా కుటుంబాల గతి ఏమిటనే విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. కరోనా లాంటి భయంకర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేస్తే కూటమి ప్రభుత్వం మాకు ఇచ్చిన గిఫ్ట్ రోడ్డున పడేయడం. ఈ విషయంలో ప్రభుత్వం మరోసారి ఆలోచన చేయాలి.

– ఎస్.కేశవయ్య, ఎండీయూ ఆపరేటర్స్ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు

క్లుప్తంగా

3 నుంచి లౌబాలి దర్గా ఉరుసు



కర్నూలు(అర్బన్): నగరంలో గురు స్వరూపంగా వెలసిన హజరత్ సయ్యద్ షా అబ్దుల్ లతీఫ్ అల్ ఖాదరి అల్ హైదరీ లౌబాలి ఖద్దసస్రిహుల్ అజీజ్ 396వ ఉరుసు మహోత్సవాలు ఈ నెల 3,4,5 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా అబ్దుల్లా హుసైని బాద్‌షా ఖాదరీ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన తరేయస్ ఖబతే – ముషాయిరాచ 4వ తేదీన నమాజు, గుసులేషరీఫ్, సాయంత్రం హాల్‌ఖే జికర్ అనంతరం నగరంలోని వీధుల్లో గొప్ప ఊరేగింపుగా గంధం దర్గాకు చేరుతుందన్నారు. 5వ తేదీన సాయంత్రం అసర్ నమాజ్ అనంతరం ఖురాన్ గ్రంధ పఠనం, ఉరుసు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో స్వామి శిష్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో హజరత్ డాక్టర్ సయ్యద్ షా హాషీం ఆరిఫ్ బాద్‌షా ఖాదరీ అల్ హైదరీ, నజీర్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

5న లక్ష మొక్కలు నాటాలి

కర్నూలు(సెంట్రల్): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 5న లక్ష మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులకు ఆదేశించారు. . శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మొక్కల నాటే కార్యక్రమం విజయవంతంపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అటవీ శాఖ అధికారులు మొక్కలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి శ్యామల,కర్నూలు మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, మెప్మా పీడీ నాగశివలీల, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్లు తేజశ్రీ, విజయకుమార్ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 114 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు శనివారం 114 మంది గైర్హాజరయ్యారు. 2వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 817 మందికి 718 మంది హాజరు కాగా 99 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 101 మందికి 86 మంది హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో సాయి శ్రీ డిగ్రీ కళాశాల విద్యార్థి ఒకరు చూచిరాతకు పాల్పడగా డిబార్ చేసినట్లు వెల్లడించారు.

నమ్మి మోసపోవద్దు

కర్నూలు: ప్రతిభ ఆధారంగానే ఉద్యోగం వస్తుంది.. డబ్బులు కడితే పోలీసు పరీక్షల్లో సాయం చేస్తామని, ఉద్యోగం వచ్చేలా చేస్తామని ఎవరైనా మాయ మాటలు చెబితే నమ్మొద్దని పోలీసు పరీక్ష రాసే అభ్యర్థులకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. కానిస్టేబుల్ మెయిన్ రాత పరీక్ష సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు విధులకు వచ్చిన పోలీసు సిబ్బందికి జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో శనివారం సాయంత్రం ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా నిర్వహించడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలో అభ్యర్థులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, మాల్ ప్రాక్టీసు వంటివి జరగకుండా నిఘా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీ శ్రీనివాసాచారి, హేమలత, భాస్కర్ రావు, ప్రసాద్, సీఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

నగరంలో పెన్షన్లు పంపిణీ

కర్నూలు (టౌన్) : నగర పరిధిలోని 48 వ వార్డు అమీర్ హైదర్ ఖాన్ నగర్‌లో నగర పాలక కమిషనర్ రవీంద్రబాబుతో కలిసి మంత్రి టీజీ భరత్ సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. తర్వాత ఆ కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దేశంలో పెన్షన్ల కోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్న రాష్ట్రం ఏపీ అన్నారు. ఇదిలా ఉంటే 25 వ వార్డు దేవనగర్‌లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పెన్షన్లు పంపిణీ చేశారు. జిల్లాలో 2,37,200 మంది పెన్షన్ దారులకు రూ.103. 35 కోట్లు పంపిణీ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.

బాబు మోసకారి



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేసిన ఘనుడు చంద్రబాబు నాయుడు అని జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ ఛైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం స్థానిక సి.క్యాంపులోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికార బలంతో కడపలో మహానాడు గొప్పగా నిర్వహించామని చెప్పుకుంటున్న తెలుగుదేశంపార్టీ నాయకులకు అది అల్ప సంతోషమే అని ఎద్దేవా చేశారు. ఎప్పటికీ కడప గడ్డ వైఎస్ జగనన్న అడ్డా అని చెప్పారు. కడపలో మహానాడు కాదని వెన్ను పోటు నాడు పేరుతో సభలు నిర్వహించారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కూటమి పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

నేడు వైద్య అవగాహన సదస్సు

కర్నూలు (హాస్పిటల్) : ఊపిరితిత్తుల క్యాన్సర్‌పై జూన్ 1న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ సెక్రెటరీ డాక్టర్ పి.చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్థానిక ఎ.క్యాంప్‌లోని కర్నూలు హెల్త్ క్లబ్‌లో సదస్సు ప్రారంభమవుతుందన్నారు.

11న పీసీసీ అధ్యక్షురాలు రాక

కర్నూలు(సెంట్రల్): పీసీసీ అధ్యక్షురాలు షర్మిళ ఈనెల 11వ తేదీన కర్నూలు రానున్నట్లు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా తెలిపారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలోని అన్ని జిల్లాల పర్యటనలో భాగంగా 11వ తేదీన ఆమె కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించే కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేంద్రనాయుడు పాల్గొన్నారు.

కౌలు రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): కౌలు రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని జేసీ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో 6వ జిల్లా కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ల్లాలోని 43 ప్రాథమిక సహకార సంఘాల కంప్యూటరైజేషన్ పూర్తి చేశామన్నారు. కొన్ని స్వయం సహాయక సంఘాలను జిల్లా సహకార బ్యాంకులో ఖాతాలు తెరచి రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో సీసీఆర్‌సీ కార్డులు ఉన్న రైతులకు సహకార బ్యాంకులు రుణాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో 10 మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ల (గోదాములు) నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం 4 శాతంతో రుణాలు మంజూరు చేస్తుందన్నారు. కర్నూలు జిల్లా మిల్క్ ఫెడరేషన్‌ను 15 రోజుల్లోగా స్థాపించాలని ఇన్‌చార్జ్ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఓ రామాంజనేయులు, డ్వామా పీడీ వెంకటరమణయ్య, జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు జీఎం రామాంజనేయులు, అగ్రికల్చర్ జేడీ వరలక్ష్మి, మెప్మా పీడీ నాగశివలీల పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులతో ప్రమాదకర వ్యాధులు

కర్నూలు(హాస్పిటల్): పొగాకు ఉత్పత్తుల వాడకంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయని, ప్రతి ఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ మాట్లాడుతూ పొగాకు వినియోగంపై పరిశ్రమ ఉపయోగించే మోసపూరిత ప్రణాళికలను బహిర్గతం చేయడం అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పొగాకు సేవించడం ద్వారా నోటి దుర్వాసన, గొంతు వ్యాధులు, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్, కఫం, దగ్గు, ఆయాసం, రక్తపోటు, క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అనంతరం ఆశా కార్యకర్తలతో పొగాకు ఉత్పత్తుల వల్ల వచ్చే అనర్థాల గురించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా అసంక్రమిత వ్యాధుల విభాగపు అధికారి శైలేష్‌కుమార్, డీఐఓ నాగప్రసాద్, జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి రఘు, డీపీఎంవో ఉమా, డాక్టర్ రామశిరీష, నిస్సిగ్రేస్, డెమో శ్రీనివాసులు శెట్టి, డి ప్యూటీ చంద్రశేఖర్‌రెడ్డి, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, ఎన్‌టీసీపీ సైకాలజిస్టు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సువర్ణలక్ష్మి కల్లి

- పొగాకు ఉత్పత్తుల సేవనంతో ప్రమాదకర క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందని మెడికవర్ హాస్పిటల్ పల్మనాలజిస్టు డాక్టర్ సువర్ణలక్ష్మి కల్లి చెప్పారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.
- ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడీఏ) రాయలసీమ బ్రాంచ్ ఆధ్వర్యంలో రాజవిహార్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరక పొగాకు వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులతో కలిగే అనర్థాలను సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ వాసురెడ్డి, ఐడీఏ సీడీహెచ్ కన్వీనర్ డాక్టర్ నౌషాద్, డాక్టర్ రామచంద్రారెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఐడీఏ ప్రెసిడెంట్ కిశోర్, జాయింట్ సెక్రటరీ నరేష్‌గౌడ్, డాక్టర్లు సతీష్, దత్తసాయి, ఉపేంద్రనాథ్‌రెడ్డి,మంజునాథ్ పాల్గొన్నారు.

డాక్టర్ సీతారామయ్య సేవలు వెలకట్టలేనివి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు యురాలజి హెచ్‌ఓడీ డాక్టర్ సీతారామయ్య అందించిన సేవలు వెలకట్టలేనివని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు కొనియాడారు. డాక్టర్ సీతారామయ్య పదవీ విరమణ చేయనున్న సందర్భంగా శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో కర్నూలు మెడికల్ కాలేజి, ప్రభుత్వ వైద్యుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అధికారులు, వైద్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ డాక్టర్ సీతారామయ్య యురాలజి ప్రొఫెసర్‌గా కొన్ని వేల మంది పేదరోగులకు నిరంతరం సేవలందించారని చెప్పారు. ఈ విభాగానికి సీతారామ య్యలేని లోటు పూడ్చలేనిదన్నారు. మాజీ పార్లమెంటు సభ్యులు డాక్టర్ ఎస్.సంజీవకుమార్ మాట్లాడుతూ డాక్టర్ సీతారామయ్య సున్నిత మనస్కులని, ప్రతి పేదవాడిని ఆప్యాయంగా పలకరించి వైద్యసేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్‌లు డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ రేణుకాదేవి, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఏపీ జీడీఏ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, నాయకులు డాక్టర్ దమామ్ శ్రీనివాసులు, డాక్టర్ జయరామ్, డాక్టర్ మాధవీశ్యామల తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ సీతారామయ్య దంపతులను సన్మానిస్తున్న అధికారులు, వైద్యులు

కారుణ్య నియామకాలు

కర్నూలు(సెంట్రల్) : కారుణ్య నియామకాల కింద 50 మందికి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఇస్తూ కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఉద్యోగాలు ఇచ్చిన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేసి ఆల్ ది బెస్టు చెప్పారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, ఏఓ విజయశ్రీ పాల్గొన్నారు.

మూల్యాంకనంలో పారదర్శకత పాటించాలి

కర్నూలు కల్చరల్: డిగ్రీ సమాధాన పత్రాల మూల్యాంకనంలో పారదర్శకత పాటించాలని రాయలసీమ విశ్వవిద్యాలయం వీసీ, ప్రొఫెసర్ వి.వెంకట బసరావు అన్నారు. వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ప్రారంభమైన డిగ్రీ స్పాట్ వాల్యూయేషన్ క్యాంప్‌ను వీసీ పరిశీలించి పలు సూచనలు చేశారు. వీసీతో పాటు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి. విజయకుమార్ నాయుడు, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య పీవీ సుందరానంద్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ శివారెడ్డి, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

వేరుశనగ పంపిణీకి చర్యలు

కర్నూలు (అగ్రికల్చర్) : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన వేరుశనగ పంపిణీ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. శనివారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శివసాయి సీడ్స్‌లో జరుగుతున్న వేరుశనగ ప్రాసెసింగ్ ప్రక్రియను పరిశీలించారు.కార్యక్రమంలో కర్నూలు ఏడీఏ సాలు రెడ్డి, ఏపీ సీడ్స్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ

కర్నూలు(సెంట్రల్): జి.సింగవరం, కల్లూరులోని రేషన్ షాపులను జేసీ నవ్య శనివారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్ 1నుంచి ఎండీయూ వాహనాల ద్వారా కాకుండా రేషన్‌షాపుల్లోనే సరుకులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆమె వెంట కర్నూలు రూరల్ తహశీల్దార్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు వీడ్కోలు



పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను సత్కరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు : సుదీర్ఘకాలం పోలీసు శాఖలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలన అధికారి విజయ్‌కుమార్ నాయుడు, సీఐ జి.సుగుణ కుమారి, సీసీఎస్ ఎస్ఐ రవూఫ్, కర్నూలు స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ కొండయ్య, పోలీస్ కంట్రోల్ రూమ్ (పీసీఆర్) ఎస్ఐ మహబూబ్ బాషా, ఆదోని తాలూకా ఏఎస్ఐ కె.జి.ఎల్.నారాయణ పదవీ విరమణ పొందారు. శనివారం సాయంత్రం వారిని జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఎ శాలువతో సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తనను కలవవచ్చని వారికి ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, స్పెషల్ బ్రాంచ్ సీఐ తేజామూర్తి, డీసీఆర్‌బీ సీఐ గుణశేఖర్ బాబు, ఆర్ఐ నారాయణ, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ వేణుగోపాల్ రాజు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ జీవితం ఆనందంగా గడపాలి

కర్నూలు (టౌన్) : పదవి విరమణ ఉద్యోగులు తమ శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో పదవి విరమణ పొందిన జూనియర్ అసిస్టెంట్ శేషాద్రిని శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్, ఆర్ఓలు ఇశ్రాయేలు, జునీద్,పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్) : ఐ అండ్ పీఆర్‌లో డివిజినల్ పీఆర్వోగా పని చేస్తున్న ఆర్.శివకుమారయ్య, సివిల్ సప్లై డిపార్టుమెంట్‌లో అసిస్టెంట్ సప్లైఆఫీ సర్ క్యాడర్‌లో పనిచేస్తున్న రామాంజనేయరెడ్డి, రెవెన్యూ శాఖలో తహసీల్దారు హోదాలో ఆర్‌డీఓ ఆఫీసు లో పని చేస్తున్న మల్లికార్జున శనివారం పదవి విరమణ చేశారు. వారికి ఆయా శాఖల ఉద్యోగులు సన్మానించి శేష జీవితం సుఖంగా సాగాలని కోరుకుంటూ వీడ్కోలు పలికారు. ఆయా కార్యక్రమాల్లో డీఎస్ఓ రాజారఘువీర్, ఐఅండ్ పీఆర్ డీడీ జయమ్మ పాల్గొన్నారు.

కర్నూలు: సుదీర్ఘకాలం పాటు ఎక్సైజ్ శాఖలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన సీఐ శేషాచలం, హెడ్ కానిస్టేబుల్ నందీశ్వర్‌రెడ్డిని శాలువ కప్పి పూలమాలలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. కర్నూలు ఎక్సైజ్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ నందీశ్వర్ రెడ్డి, ఛత్రగుడి చెక్‌పోస్టులో సీఐ శేషాచలం పనిచేస్తూ పదవీ విరమణ పొందారు. కార్యాలయంలో జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్ బాబు వారిని సత్కరించి సాగనంపారు. కార్యక్రమంలో సీఐలు చంద్రహాస్, రాజేంద్ర ప్రసాద్‌తో పాటు ఎస్ఐలు పాల్గొన్నారు.

నేల ఆరోగ్య సంరక్షణపై అవగాహన

కర్నూలు(సెంట్రల్): నేల ఆరోగ్య సంరక్షణ, సుస్థిర పత్తి ఉత్పత్తులపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా వ్యవసాయశాఖాధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నేల ఆరోగ్య సంరక్షణ, పత్తిలో పంట రక్షణ యాజమాన్య బుక్ లెట్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో అత్యధికంగా సాగవుతున్న పత్తిలో సుస్థిర పద్ధతులను ప్రవేశపెట్టడానికి జిల్లా వ్యవసాయ శాఖ మారి స్వచ్ఛంద సేవా సంస్థతో వినూత్నమైన బెటర్ కాటన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో భాగంగా దేవనకొండ, కోడుమూరు మండలాల్లో దాదాపు 8075 మంది రైతులు సుస్థిరపత్తి ఉత్పత్తులపై దృష్టి సారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, మారి సంస్థ ఈడీ ఆర్ మురళీ పాల్గొన్నారు.

ఆలయాలు పునరుద్ధరించిన అహల్యాబాయి



అహల్యాబాయి జయంతి కార్యక్రమంలో యాదవ మహాసభ నేతలు

కర్నూలు(అర్బన్): దేశంలోని పలు ఆలయాలను మహారాణి అహల్యాబాయి పునరుద్ధరించాలని అఖిల భారత యాదవ మహాసభ నేతలు తెలిపారు. శనివారం అహల్యాబాయి జయంతి సందర్భంగా స్థానిక శంకరాస్ డిగ్రీ కళాశాలలో కేక్ కట్ చేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మహాసభ రాయలసీమ జిల్లాల కో కన్వీనర్ టి. శేషఫణి యాదవ్, కాటమరాజు పచ్చిక బయళ్ల సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు చింతల మోహన్‌రావు యాదవ్, ఆదర్శ విద్యా సంస్థల అధినేత తిమ్మయ్య యాదవ్, నాయకులు నాగరాజుయాదవ్, అయ్యన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహారాణి అహల్యాబాయి మరాఠాలు పరిపాలించిన మాల్వా సామ్రాజ్యపు హోల్కర్ వంశానికి చెందిన రాణి అని చెప్పారు. ఆమె తన పాలనలో హిందు మత కార్యకలాపాలు, అనేక ధార్మిక కార్యక్రమాలను నిర్వహించారన్నారు. భారత దేశ సంస్కృతికి ఆమె ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెరుగు శివకృష్ణయాదవ్, శివరామకృష్ణ యాదవ్, సింధు నాగేశ్వరరావు, నాగరాజుయాదవ్, సోమన్న యాదవ్, బాలస్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అరుదైన కిడ్నీ మార్పిడి ఆపరేషన్



కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్న ధనుంజయతో డాక్టర్ అనంతరావు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని కిమ్స్ హాస్పిటల్‌లో అత్యంత అరుదైన కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు నెఫ్రాలజిస్టు డాక్టర్ అనంతరావు చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం ఆయన మీడియాకు విడుదల చేశారు. నంద్యాలకు చెందిన 27 ఏళ్ల ధనుంజయకు మూడేళ్లుగా కిడ్నీ సమస్య ఉందని, ఐజీఏ నెఫ్రోపతి కారణంగా అతని కిడ్నీలు పాడయ్యాయని తెలిపారు. మూడేళ్లుగా డయాలసిస్‌పై ఉండి ఆయన జీవనధాన్‌లో కిడ్నీ మార్పిడికి దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. కిడ్నీ అందుబాటులోకి రావడంతో అతనికి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం అతను పూర్తిగా కోలుకున్నాడన్నారు. సాధారణంగా ఇప్పటి వరకు లైవ్ డొనేషన్ల విషయంలోనే ఇలా డీసెన్సిటైజేషన్ చేస్తున్నారని, కెడావర్ డొనేషన్ల విషయంలో ఎలా చేయాలన్నది ఇప్పటి వరకు మెడికల్ జర్నల్స్‌లో కూడా లేదన్నారు. తొలిసారిగా ఈ తరహా చికిత్సను కర్నూలు కిమ్స్‌లో చేసినట్లు తెలిపారు.

సదరంలో దాహం తీరింది!

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు(హాస్పిటల్) : సదరంలో దాహం... దాహం అనే శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో వచ్చిన కథనానికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అధికారులు స్పందించారు. ఈ మేరకు సదరం క్యాంపులో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌లో మరమ్మతులు చేయించారు. ముందుగా సదరం క్యాంపుపై ఉన్న ట్యాంకుకు నీరుఅందేటట్లు చేశారు. ఆ తర్వాత వాటర్ ప్లాంటులో పలు మరమ్మతులు చేయించారు. దీంతో సదరం క్యాంపులో తాగునీటి సమస్య తీరినట్లయ్యింది.



వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది